సాక్షి నిజామాబాద్

సోమవారం, 5, మే, 2025



ధాన్యం తూకం.. అంతా మోసం..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేచుడుతున్న తూకంలో మోసానికి పాల్పడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- 10లో ▸



పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ పోతరాజు సాయి చైతన్య పేర్కొన్నారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
45.4 /23.8

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిజామాబాద్



నిజామాబాద్‌నాగారం: జగిత్యాల జిల్లాలో ఈనెల 2నుంచి 4 వరకు జరిగిన 11వ రాష్ట్ర జూనియర్ బాలికల చాంపియన్‌షిప్ పోటీలో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిద్దిపేట జట్టుపై 01–0 పరుగుల తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. ముఖ్యఅతిథిగా జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ విచ్చేసి, విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్లో ఉత్తమ క్యాచర్‌గా లిఖిత ప్రత్యేక బహుమతిని అందుకుంది. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా నరేష్, సుజాత, వినయ్, తిరుపతి వ్యవహరించారు.

డీఈవో అశోక్‌కు సన్మానం



నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని మానవ వనరుల శిక్షణ కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సన్మానించారు. విద్యా నాయకత్వంపై డీఈవోలు, డైట్ ప్రిన్సిపాళ్లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో మూడు కేటగిరీల్లో ప్రతిభ కనబర్చిన వారిని అవార్డుకు ఎంపిక చేశారు. పోస్ట్ టెస్ట్ విభాగం, జిల్లాలో ఏఐ ఇంటిగ్రేషన్ పనితీరు, మూడు రోజుల శిక్షణలో మోస్ట్ యాక్టివ్ పర్సన్‌గా డీఈవో అశోక్ ఎంపిక కావడంతో విద్యాశాఖ కార్యదర్శి సన్మానించి అవార్డును అందజేశారు.



పసుపు గ్రేడింగ్ చేసే యంత్రం వద్ద పని చేస్తున్న మహిళలు

రాష్ట్రంలో

తొలి పసుపు పరిశ్రమ!

- మనోహరాబాద్‌లో నేడు ప్రారంభించనున్న ఎంపీ అర్వింద్
- 600 మంది రైతులు కలిసి సొంతంగా ఏర్పాటు చేసుకున్న యూనిట్
- పసుపు ఉడకబెట్టి, పాలిష్ చేసి, గ్రేడింగ్ చేసి, పసుపు ఆకులతో ఆయిల్ తీసే యంత్రాల కొనుగోలు, గోదాముల నిర్మాణం
- 'ఇందూరు పసుపు' బ్రాండ్ పేరుతో ఈజిప్టు దేశానికి పసుపు పొడి ఎగుమతి



పసుపు పాలిష్ చేసే యంత్రం



పసుపు పౌడర్ పట్టే యంత్రాలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్రంలోనే తొలిసారిగా రైతులే స్వయంగా జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో నెలకొల్పిన పసుపు పరిశ్రమ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. ఇందుకు 'రైతు ఉత్పత్తిదారుల సంఘం' అన్ని ఏర్పాట్లు చేసింది. ఎంపీతో పాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ, ఆర్మూర్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును ఆహ్వానించారు. రెండేళ్ల క్రమంలోనే తర్వాత పసుపు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ప్రారంభించుకోవడం పై ఎఫ్‌పీవో సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండించిన పసుపు పంటను మార్కెట్‌కు వెళ్లి విక్రయించడానికి బదులు జిల్లా తీసుకుని పడుతున్న నేపథ్యంలో స్వయంగా పసుపు క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. పంటను పండించి దానికి రేటు కట్టి విదేశాలకు ఎగుమతి చేయాలని భావించారు. అనుకున్నట్లుగానే జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, కలిగోట్, పడకల్, మైలారం గ్రామాల నుంచి 600 మంది రైతులు పోగయ్యారు. జేఏంకేపీఎం పేరుతో మనోహరాబాద్‌లో అర ఎకరం స్థలాన్ని ఎంపిక చేసి సొంతగా పసుపు పరిశ్రమ కోసం 2023లో పనులు ప్రారంభించారు.

ఇందుకు కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ పథకం కింద రుణసాయం పొందారు. పసుపు ఉడకబెట్టి, పాలిష్ చేసే, గ్రేడింగ్ చేసే, పసుపు ఆకులతో ఆయిల్ తీసే యంత్రాలను కొనుగోలు చేశారు. గోదాములు నిర్మించుకున్నారు. ప్రారంభోత్సవానికి అంతా సిద్ధం చేసుకుని ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి ఒప్పందాలను చేసుకున్నారు. మొదటిసారిగా 'ఇందూరు పసుపు' బ్రాండ్ పేరుతో ఆర్మూర్ పసుపు పొడిని ఈజిప్టు దేశానికి ఎగుమతి చేయనున్నారు. ఏడాదిలో రూ.100 కోట్లు, ఐదేళ్లలో రూ.500 కోట్ల టర్నోవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రైతు ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు పొట్టూరి తిరుపతి రెడ్డి వెల్లడించారు. మార్కెటింగ్‌ను విస్తృతం చేస్తామని పసుపు పంట ఉత్పత్తులే కాకుండా భవిష్యత్తులో ఇతర పంటలను కూడా ఎగుమతి చేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు.



జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో రైతులు నెలకొల్పిన పసుపు పరిశ్రమ

నేటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

- పైలట్ మండలంగా మెండోరా ఎంపిక
- రెండు రెవెన్యూ బృందాల నియామకం
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సులు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడి

నిజామాబాద్అర్బన్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా పైలట్ ప్రాతిపదికన జిల్లాలోని మెండోరా మండలాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. సదస్సుల నిర్వహణ కోసం రెండు రెవెన్యూ బృందాలను నియమించినామని పేర్కొన్నారు. ఈ బృందాలు షెడ్యూల్‌ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రతి రోజు ఒక్కో బృందం ఒక గ్రామం చొప్పున రోజుకు రెండు గ్రామాలలో సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి సహకారం అందించేందుకు వీలుగా హెల్ప్‌డెస్క్ బృందాలు, దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలన జరిపేలా వెరిఫికేషన్ బృందాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 5న బుస్సాపూర్, మెండోరా గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, 7న వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్, సావెల్ గ్రామ పంచాయతీలో, 8న దూదిగాం సీఎస్ఐ స్కూల్, సోన్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 6న చాకిర్యాల, కొడిచెర్ల గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వివరించారు. భూ సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

భగీరథుని స్ఫూర్తితో ముందుకు సాగాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- ఘనంగా భగీరథ మహర్షి జయంతి

నిజామాబాద్‌అర్బన్: కష్టమైన కార్యం సాధించాలంటే భగీరథుని స్ఫూర్తితో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వేడుకలకు హాజరైన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగీరథుడు ఘోర తపస్సు ద్వారా ఆకాశ గంగను భూమికి తెచ్చాడని పురాణ ఇతిహాసాలలో పేర్కొనబడిందని గుర్తుచేశారు. మహనీయుల స్ఫూర్తితో సమాజహితానికి పాటుపడేందుకు వీలుగా ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. మహనీయులు ఆశయాలను పుణికిపుచ్చుకుని ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతన్న ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం
- వడగళ్లతో ఇతర పంటలకూ నష్టం
- పిడుగుపాటుతో ఇద్దరి పరిస్థితి విషమం



రాజంపేట కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన, తూకం వేసిన ధాన్యం చుట్టూ చేరిన వర్షపునీరు



కామారెడ్డి గాంధీ గంజ్‌లో తడిసిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

కామారెడ్డి టౌన్/భిక్కనూరు/దోమకొండ/తాడ్వాయి/గాంధారి/లింగంపేట/రాజంపేట/బీబీపేట: కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్నిచోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో వడ్లు ఆరబెట్టిన రైతులు.. వర్షం రాకతో ఆగమయ్యారు. కామారెడ్డి పట్టణంలో గంట పాటు కురిసిన వర్షంతో రోడ్లపై నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మాచారెడ్డి, రాజంపేట తదితర మండలాల్లో వడగళ్లు కురిశాయి. భిక్కనూరు, దోమకొండ మండలాల్లోని పలు గ్రామాలలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. లింగంపేట మండలంలోని భవానీపేట, జల్దిపల్లి, రాంపూర్, ముంబోజీపేట, గాంధారి మండలంలోని పలు గ్రామాలలో, తాడ్వాయి మండలకేంద్రంతోపాటు కరడ్‌పల్లి, కన్‌కల్, దేమికలాన్, కృష్ణాజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బలమైన గాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. మామిడి కాయ లు రాలిపోయాయి. మొక్కజొన్న నేలవాలింది. వడ్ల ను వెంటవెంటనే తూకం వేసి, రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుజాల్‌పూర్‌లో పిడుగుపాటు కలకలం

బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్‌కు చెందిన గోప వివేక్, కలుకుట్ల రాజు, గోప కవిత, గోప హేమలత, గోప రంజిత్ వర్షం వస్తుండడంతో వడ్లను కుప్పచేసి చెట్టుకిందికి చేరారు. ఆ చెట్టుపై పిడుగుపడింది. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కామారెడ్డిరూరల్ : కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి, పాతరాజంపేట్, సరంపల్లి, క్యాసంపల్లి, దేవునిపల్లి, లింగాపూర్, నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి పరిధిలోని గురు రాఘవేంద్ర కాలనీలో వడగండ్లు కురిశాయి.



భవానీపేటలో తడిసిన ధాన్యం

అర్హుల జాబితా జల్లెడ

- పేదలకే ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించేలా చర్యలు
- అనర్హుల తొలగింపునకు మరోమారు సర్వే నిర్వహిస్తున్న అధికారుల బృందం
- క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఫైనల్ చేసిన జాబితాల పరిశీలన



భీమ్‌గల్‌లో సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఇంటి నిర్మాణ సాయం అందుకునే వారిలో పక్కాగా అర్హులే ఉండాలనే ఉద్దేశంతో అధికారుల బృందం మరోమారు సర్వే చేపట్టింది. మొదట ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని అధికారులు స్వయంగా కలిసి అర్హత ఉందో లేదా అని తేల్చేందుకు సాంకేతిక సాయంతో సర్వే నిర్వహించారు. అధికారులు సిద్ధం చేసిన అర్హుల జాబితాలను ఇందిరమ్మ కమిటీలు పరిశీలించి లబ్ధి పొందేవారిని ఎంపిక చేశారు. కాగా, ఇందిరమ్మ కమిటీలలో ఎక్కువగా అధికార పార్టీ నియమించిన వారే సభ్యులుగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగిందో లేదో అనే సందేహంతో మరోమారు సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీ సిద్ధం చేసిన తుది జాబితాలోనూ అనర్హులుంటే వారిని తొలగించాలని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మండల స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, పట్టణాలలో మున్సిపల్ ఉద్యోగులు సర్వే నిర్వహిస్తూ అర్హుల కోసం జల్లెడ పడుతున్నారు. కాగా, వితంతువులు, దివ్యాంగులు, పూరి గుడిసెలో ఉన్నవారు, ప్రమాదవశాత్తు ఇళ్లు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం సూచించగా అవే మార్గదర్శకాలను అధికారులు అనుసరిస్తున్నారు.

నిర్మాణంపై అవగాహన..

అర్హులైన వారు ఇందిరమ్మ ఇంటి సాయం అందుకునేందుకు పాటించాల్సిన మార్గదర్శకాలను అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు ఇచ్చిన యాప్‌లో ఇంటి నిర్మాణ విస్తీర్ణం పక్కాగా లెక్క కట్టే వెసులుబాటు ఉంది. దీంతో 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా 600 చదరపు అడుగులకు ఎక్కువ కాకుండా ఇంటి నిర్మాణం చేపట్టేలా సూచిస్తున్నారు. తొలి విడతలో కొందరు ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించడంతో వారికి బిల్లు మంజూరు సాధ్యం కాలేదు.

మంజూరు నామమాత్రమే..

ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటే రూ.5 లక్షల సాయం అందిస్తామని ప్రభుత్వం వెల్లడించిన విషయం విదితమే. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మొత్తంలో ఎంపిక చేసిన 31 గ్రామాలలో కేవలం 2,762 మందికే సాంకేతిక ఆమోదం తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి సాయం అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అర్బన్ నియోజకవర్గంతో సహా మిగిలిన అన్ని చోట్లా మరో 16వేలకు పైగా ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చి దశల వారీగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. కాగా, గృహ నిర్మాణసంస్థలో ఉద్యోగుల కొరత కారణంగా ఇళ్ల నిర్మాణానికి సాంకేతిక ఆమోదం తెలిపినా గ్రౌండింగ్‌తోపాటు ఇంటి నిర్మాణ దశల వారీ పరిశీలన అత్యంత కష్టతరంగా మారింది.

కసరత్తు చేస్తున్నాం

ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన వారిలో ఎవరైనా అనర్హులుంటే వారి పేర్లను తొలగిస్తున్నాం. పక్కాగా అర్హులైన వారికే ఇందిరమ్మ ఇంటి నిర్మాణ సాయం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ ఒక్క అనర్హునికి పథకం వర్తింపజేయడం జరుగదు. **– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్**

నీట్ పరీక్షకు 3,298 మంది హాజరు

- రెండు కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు
- లోనికి అనుమతించని అధికారులు

నిజామాబాద్అర్బన్: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏడినిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,398 మంది అభ్యర్థులకు 3,298 మంది పరీక్షకు హాజరుకాగా, 100 మంది గైర్హాజరయ్యారు. సెంటర్ నిర్వాహకులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు అభ్యర్థులు, బోధన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద పరీక్ష నిర్వహణ అధికారులు, పోలీసు సిబ్బంది మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. విద్యార్థులను తనిఖీలు చేయాలని పరీక్షల నిర్వహణ అధికారులు పోలీసులకు తెలిపారు. తనిఖీలు చేసే బాధ్యత తమది కాదని కేవలం సెక్యూరిటీ మాత్రమే తమది అని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది.

సెంటర్ల వారీగా హాజరైన అభ్యర్థుల వివరాలు

నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో 720 మంది అభ్యర్థులకు 705 మంది హాజరుకాగా, 15 మంది గైర్హాజరయ్యారు. తెలంగాణ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 456 మంది అభ్యర్థులకు 438 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కేంద్రంలో 384 మంది అభ్యర్థులకు 374 మంది హాజరు కాగా 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 432 మంది అభ్యర్థులకు 420 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 432 మంది అభ్యర్థులకు 422 మంది పరీక్ష రాయగా, 10 మంది హాజరుకాలేదు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో 384 మంది అభ్యర్థులకు 373 మంది హాజరుకాగా, 11 మంది గైర్హాజరయ్యారు.

నాగారంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 312 మందికి గాను 304 మంది పరీక్ష రాయగా, 8 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో 278 మంది అభ్యర్థులకు 262 మంది హాజరుకాగా, 16 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.



నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు



పాలిటెక్నిక్ కేంద్రం వద్ద అభ్యర్థులు





నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష కేంద్రాలను సీపీ సాయి చైతన్య సందర్శించారు. కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష సరళి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు రాసిన జవాబుపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సీపీ వెంట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీజీ బ్లాక్ ఇన్‌చార్జి డిప్యూటీ డాక్టర్ కే రంజిత, ఎస్సైలు, సీఐలు, సిబ్బంది ఉన్నారు.



క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలో ఆదివారం జిమ్నాస్టిక్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర జిమ్నాస్టిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, ఎలక్షన్ ఆఫీసర్ గోపిరెడ్డి, రాష్ట్ర అబ్జర్వర్ ముస్తఫా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ భూమారెడ్డి, జిల్లా యువజన క్రీడా అథారిటీ అబ్జర్వర్ ఆర్చరీ కోచ్ మురళి పాల్గొని జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏలేటి కిరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా స్వామి కుమార్, కోశాధికారిగా చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్, హర్దీప్, విజయ్, వేణురాజ్, జాయింట్ సెక్రెటరీ లుగా బుచ్చన్న, సురేష్ రెడ్డి, ప్రవీణ్,దేవేందర్, ఈసీ మెంబర్స్‌గా రాజేశ్వర్,మురళి, ప్రకాష్, సంధ్య, రాకేష్, రాజకుమార్, మణి తేజ, శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



ఇందల్వాయి: దొంగతనాల నివారణకు గ్రామస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ అన్నారు. శనివారం అర్ధరాత్రి ఇందల్వాయిలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో దొంగలు పడి రూ.70వేల నగదు, 13 తులాల వెండి గొలుసులు, 2 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు జగ్గ జమున, నర్సింగ్ గంగాదాస్ ఫిర్యాదు మేరకు ఇందల్వాయి ఎస్సై సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఇందల్వాయి గ్రామాన్ని సందర్శించిన సీఐ, ఎస్సై లు గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు బృందాలుగా ఏర్పడి రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

సిరికొండ: అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని ట్రాన్స్‌కో డిచ్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. సిబ్బంది విధుల్లో భద్రతా నియమాలు పాటించి సంస్థను జీరో ప్రమాదాల స్థాయికి తీసుకురావాలన్నారు. విద్యుత్ ప్రసారంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వినియోగదారులు స్వంతంగా మరమ్మతులు చేపట్టకుండా సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఇతర నియమాలపై అవగాహన కల్పించారు. సిరికొండ సెక్షన్ ఏఈ చంద్రశేఖర్, సబ్ ఇంజినీర్ గంగారాం, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు బాలచంద్రం, రాములు, లైన్‌మన్ జగన్, సుభాష్, సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకం.. అంతా మోసం..

- 41.5 కేజీలకు బదులు 42.1 కేజీల తూకం వేస్తున్న నిర్వాహకులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో కాంటాలు నిర్వహిస్తున్న హమాలీలు



బస్తాను 42.1 కేజీలకు తూకం వేస్తున్న దృశ్యం

బాల్కొండ: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చేపట్టిన ధాన్యం తూకంలో మోసానికి పాల్పడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లిలో వేంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులను మోసం చేస్తూ తూకం వేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలో ఒక్కో బస్తా 41.5 కేజీలకు తూకం వేయాలి. ఇందులో 500 గ్రాములు బస్తా బరువు, ఒక కిలో కద్దాగా పేర్కొంటూ అధికారులు నిబంధనలు తయారు చేశారు. కానీ ఇక్కడ అధనంగా 600 గ్రాములు తూకమేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు మద్దతు ధర దేవుడెరుగు కానీ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలతో రైతులు సతమతమవుతున్నారు. అసలే హమాలీలు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి కాంటాలు కావడం లేదు. దీంతో తేమ శాతం తగ్గి ధాన్యం తూకంలో అనేక తేడాలు వస్తున్నాయి. దానికి తోడు ఇలా ఎక్కువ తూకం వేయడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం తూకం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎక్కువ తూకం వేస్తున్నారు.

కొనుగోలు కేంద్రంలో బస్తాను 42.100 కేజీలకు తూకం చేస్తున్నారు. ఎక్కువ తూకం వేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. ఎండకాలం కావడంతో రోజులోనే తేమ శాతం తగ్గిపోతుంది. అయిన ఎక్కువగా తూకం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో మోసాలను అరికట్టాలి.

– చందు, రైతు, కొత్తపల్లి

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పోలీసు సిబ్బందికి కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఖలీల్‌వాడి: పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఉండటంతో తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని, తమ ఆరోగ్యంతోపాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో కంటి వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. వ్యాధుల భారీన పడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదన్నారు. ప్రతి ఒక్కరు పౌష్టిక ఆహారం తీసుకోవాలని తెలిపారు. పోలీసులు ఉచిత కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకువాలని, ప్రతి ఒక్కరూ 6 నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలు తప్పనిసరిగ్గా చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్యులు 450 మంది సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రొబేషనర్ ఐపీఎస్ సాయికిరణ్, అదనపు డీసీపీ(ఏఆర్) రామచందర్ రావు, ఏసీపీలు శ్రీనివాస్, మస్తాన్ అలీ, రిజర్వు సీఐ శేఖర్‌బాబు, సతీష్, సరళ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి మృతిపై సంతాపం

ఖలీల్‌వాడి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె మృతిపై న్యాయవాద పరిషత్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ సంతాపాన్ని తెలిపారు. ఆమె మృతి రాష్ట్ర న్యాయ వ్యవస్థకు తీరని లోటని, అంచెలంచెలుగా ఎదుగుతూ న్యాయ సేవలు బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు. ఆమె సేవలు మరువలేనివన్నారు.



సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్ 1985-86 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



పెర్కిట్ జెడ్పీహెచ్‌ఎస్ 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

దశాబ్దాల తర్వాత ఒక్కచోటికి..

- జిల్లాలో పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



నగరంలోని రావూజీ వంజరి సంఘం ఉన్నత పాఠశాల 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. -సాక్షి నెట్‌వర్క్



నందిపేటలోని సూర్యోదయ హైస్కూల్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఘన్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్ 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఏఆర్పీ క్యాంప్ జెడ్పీహెచ్‌ఎస్ 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నగరంలోని వాసు హై స్కూల్ 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

రైతు ఉత్పత్తిదారుల సంఘాల కాలపరిమితి పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: అభివృద్ధి చెందుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల కాలపరిమితిని పెంచాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. దేశంలోనే రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు వినియోగదారులకు అందించేందుకుగాను స్టాల్స్ ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో రైతు నాయకులు కొండల్ సాయారెడ్డి, వేల్పూర్ భూమయ్య, కొట్టే గంగాధర్, కిష్టాగౌడ్, మమ్మాయి రాజన్న, పద్మ, పెంటయ్య, ఎఫ్‌పీవోల చైర్మన్లు వినయ్‌కుమార్, సిరికొండ శ్రీనివాస్, పృథ్వీరాజ్, శంకర్, హన్మాండ్లు, పుష్ప, గోపాల్ పాల్గొన్నారు.

ఒలింపిక్ సంఘ భవన స్థలాన్ని కాపాడుకుంటాం



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: ఒలింపిక్ సంఘ భవన స్థలం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడుకుంటామని సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య అన్నారు. ఆదివారం నగరంలోని ముబారక్‌నగర్‌లో ఉన్న ఒలింపిక్ సంఘ భవన స్థలాన్ని సభ్యులతో కలిసి పరిశీలించారు. 2010లో గత ప్రభుత్వం ఖలీల్‌వాడిలో ఉన్న స్టేడియం స్థలానికి బదులు ముబారక్‌నగర్‌లో 7ఎకరాల35 గుంటల స్థలంతో పాటు పక్కనే ఉన్న 700 గజాల స్థలాన్ని సంఘ భవనం కోసం కేటాయించిందని అన్నారు. ఈ స్థలంలో గతంలో మంత్రి ఉన్న సుదర్శన్‌రెడ్డి మంజూరు చేసిన రూ. 15 లక్షల నిధులతో బేస్మెంట్, పిల్లర్ల వరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. కొందరు భూకబ్జాదారులు స్థలాన్ని తమదంటు ఆక్రమణలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎవరైనా స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. సభ్యులు భూమారెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, అబ్బన్న, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జావేద్, రమేశ్ పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటు: వృద్ధురాలి మృతి



మృతి చెందిన అనసూయ

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన బుయ్య అనసూయ(60) అనారోగ్యానికి గురికాగా ఆదివారం భర్త, కోడలితో కలిసి కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని తిరుగు ప్రయాణం కోసం నిజాంసాగర్ చౌరస్తాకు వచ్చి అక్కడ టీ తాగి బస్సు ఎక్కింది. కొద్దిసేపటికే ఛాతిలో నొప్పితో పడిపోయింది. ఆమెను వెంటనే అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు వడ్డెర కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్సై రామ్ తెలిపారు. కాలనీకి చెందిన లక్ష్మి(38) అనే మహిళ టీ తాగడానికి సమీపంలోని హోటల్‌కు వెళుతుండగా క్రేన్ వ్యాన్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భైరాపూర్‌లో ఒకరి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

మోపాల్: మండలంలోని భైరాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లకావత్ ప్రసాద్ (33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్లుగా అతడు తలనొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా, చికిత్సలు చేయించుకున్న నొప్పి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో శనివారం రాత్రి అతడు పురుగుల మందు తాగాడు. ఆదివారం మధ్యాహ్నం కడుపు నొప్పి రావడంతో కుటుంబసభ్యులకు పురుగుల మందు తాగానని చెప్పాడు. వెంటనే వారు అతడిని నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రసాద్ భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో వివాహిత..

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మాందాపురం మంజుల (30)కు పాల్వంచ మండలం భవానిపేట గ్రామానికి చెందిన బాలకిషన్‌తో 9ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబంలో తరచు గొడవలు జరుగగా, మంజుల చెయ్యి విరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వచ్చింది. మంజుల తన భర్త, అత్తమామలతో ఇటీవల ఫోన్లో మాట్లాడగా వారు నువ్వు ఇక్కడికి వస్తే మేము చనిపోతాం అని చెప్పడంతో మనస్తాపం చెందింది. దీంతో ఆమె పుట్టినింట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి కారకులైన భర్త, అత్త, మామలపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వీడీసీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం నాయకులు

నిజామాబాద్‌నాగారం: గ్రామాల్లో వీడీసీల ఆగడాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కోయడ నరసింహులు గౌడ్ అన్నారు. నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ గ్రామాలలో వీడీసీల కబంధ హస్తాలలో సాంఘిక బహిష్కరణలు ఈతవనం దగ్ధాలు, బెదిరింపులు ఆగకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే వీడీసీలను నిషేధించాలని వారి ఆగడాలను అరికట్టాలన్నారు. వీడీసీలపై బహుజన, వృత్తి, ప్రజా సంఘాలు అన్నీ కలిసి ఉద్యమాలు, పోరాటాలు చేయాలన్నారు. తాళ్ల రాంపూర్‌లో గౌడ గీత కుటుంబాల బహిష్కరణ, ఈతవనం దగ్ధం, గౌడ మహిళకు ఆలయంలో అవమానం ఘటన అనంతరం చెంగల్ కల్దుర్కి తగ్గెల్లి తదితర మండలాల్లో వేలాది ఈత వనాలను దగ్ధం చేయడం సరికాదన్నారు. అలాగే అంకాపూర్, కోటా ఆర్మూర్ గంగాసాగర్, మాక్లూరు బోర్గాంలలో వీడీసీలు బహిష్కరణలు, బెదిరింపులకు పాల్పడుతుండటం మాత్రం ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీడీసీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, దగ్ధమైన ఈతవనాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వీడీసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీరాంగౌడ్, శేఖర్ గౌడ్, కిషన్ గౌడ్, తాళ్ల శ్రీనివాసగౌడ్‌లు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

సిరికొండ: అడవిలో తునికాకు సేకరణ వెళ్లిన ఓ మహిళపై ఎలుగుబంటి దాడి చేసి, గాయపర్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిన్నరెడ్డి తండాకు చెందిన భారతి అనే మహిళ ఆదివారం తండావాసులతో కలిసి జినిగ్యాల మైసమ్మ అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లింది. తునికాకు తెంపుతుండగా పొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా బయటకు వచ్చి ఆమెపై దాడి చేసింది. చుట్టుపక్కల ఉన్నవారు కేకలు వేయడంతో ఎలుగుబంటి అడవిలోకి పారిపోయింది. దాడిలో భారతి కాలుకు తీవ్ర గాయమైందని స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెను ఇంటికి తీసుకువచ్చారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని ఐదో టౌన్ పరిధిలో బైక్ పోయిందని దర్శనం ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు వర్ని చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేయగా బోధన్‌కు చెందిన కన్యబోయి గంగాధర్ (30) అనుమానాస్పదంగా కనబడటంతో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని విచారణ చేయగా బైక్ దొంగతనం చేసినట్లు తెలిపారు. గంగాధర్ దగ్గర నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూటీ చోరీ కేసులో..

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని కవిత కాంప్లెక్స్‌లో ఈనెల 2న మధ్యాహ్నం షేక్ కరీంముద్దీన్ తన స్కూటీని పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని దుండుగులు చోరీకి పాల్పడ్డారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా, స్కూటీపై అనుమానాస్పదంగా కనిపించిన యువకుడిని పట్టుకున్నారు. విచారణ చేపట్టగా విచారించగా అతడు ఎటువంటి సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా వెంటనే డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన చౌహాన్ అర్జున్(25)గా గుర్తించారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

కోటగిరిలో యువకుడి అదృశ్యం

రుద్రూర్: కోటగిరికి చెందిన అనిల్ (27) అనే యువకుడు గత రెండు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై సునీల్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3న ఉదయం పనికి వెళ్లిన అనిల్ తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అనిల్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నగరంలో వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆముద అంజయ్య (70) అనే వృద్ధుడు అదృశ్యం అయినట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంజయ్య తిరిగి ఇంటికి రాలేదన్నారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అంజయ్య ఇంటి నుంచి వెళ్లే ముందు నీలి రంగు లుంగీ, తెలుపు బనియన్ వేసుకున్నట్లు తెలిపారు. అతడికి మతిస్థిమితం సరిగ్గా ఉండదని, ఆచూకీ తెలిసిన 8712659839, 8712659717 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సాలూరలో బైక్ చోరీ

బోధన్ రూరల్: సాలురా మండల కేంద్రంలో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దాసరి రాజు తన బైక్‌ను శనివారం రాత్రి ఇంటి ముందు ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారు. మరుసటి రోజు బైక్ చోరీని గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో హుండీ..

నవీపేట: మండలంలోని యంచ విఠలేశ్వరాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. ఆలయంలోకి శనివారం అర్ధరాత్రి దుండగులు చొరబడి హుండీని పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అలాగే గర్భగుడిలోని బీరువా తాళాలు పగలగొట్టి ఆరు తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పూజారి రంజిత్ ఆలయంలోకి వెళ్లగా చోరీని గుర్తించి, వీడీసీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. వీడీసీ అధ్యక్షుడు సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.